
# చిలక్కో గోరింక

జి. రజిత

“ఈ పెళ్లికి చచ్చినా మేం అంగీకరించం. అదెలా చేస్తారో మేమూ చూస్తాం. ఆ అబ్బాయి కారు నలుపు. పైగా మన సుశీలకంటే చాలా పొట్టి. మన సుశీ బంగారం లాంటి పిల్ల. తెల్లగా, చూడచక్కగా కుందనపు బొమ్మలా ఉంది. ఒడ్డూ పొడుగులోనూ వారిద్దరికీ చాలా వ్యత్యాసం. అతడిలా యూనివర్సిటీల్లో న్యాయవాద పట్టా తీసుకోకపోయినా, ఆమెకు గోల్డ్ మెడల్ రాకపోయినా సుశీ పాలిటెక్నిక్ చదివింది. ఆమె చదువుకునేటప్పుడు స్కూల్ ఫస్ట్, కాలేజీ ఫస్ట్ వచ్చింది. ఎంతో ప్రేమగా దాన్ని ఈ నా రెండు చేతులతో పెంచా. దయచేసి నువ్వు నీ చెల్లెలిని ఆ కులంకాని కులంవాడికిచ్చి చేయకు శ్రీకాంత్. పిల్లలకు పాఠాలు చెప్పే ప్రొఫెసర్‌వి నువ్వు. నువ్వే దాని గొంతు కోయకు. కొంచెం ఆలోచించుకో నేనెందుకు చెబుతున్నానో. నేనెప్పుడూ మీ మేలే కోరానురా. మమ్మల్ని ఊరిలో తలెత్తుకోకుండా చేయకురా” అంది మా మేనత్త వెంకట సుబ్బమ్మ ఎంతో ఆవేదనగా కళ్లనీళ్లు పెడుతూ.



మా మేనత్తకు చిన్న వయసులోనే భర్త చనిపోవడంతో అప్పటి నుంచి మా పెదనాన్న ఇంట్లోనే ఉంటోంది. పిల్లలు లేని ఆమె మేము పుట్టక ముందే మా ఊరికి వచ్చేసిందట. నా చిన్నప్పటినుంచి ఆమెకు నాపై చాలా కోపం. దానికి కారణం నేను అన్ని కులాలవారితోనూ కలగలిసిపోతానని, మాదిగలు, మాలల పిల్లల్ని దగ్గరకు తీసుకుంటానని ఆమెకు నేనంటే పెద్దగా ఇష్టం ఉండదు. నన్ను మా వంశంలో చెడబుట్టినవాడిగానే పరిగణిస్తుంటుంది.

ఇక మా పెదనాన్న కొడుకు, సుశీల సొంత అన్న రాజీవుకు కూడా నేనంటే అంతగా ఇష్టం ఉండదు. వాడు సుశీలకు సొంత అన్న కావడంతో ఆమెపై సర్వహక్కులూ తనకున్నాయని భావిస్తుంటాడు. నాపై ఎప్పుడూ గుర్రుగా ఉంటాడు. వాడి పల్లెటూరి సంస్కృతిని, పాత ఆలోచనలను, పద్ధతులను, అలవాట్లను విమర్శిస్తూ అప్పుడప్పుడు ఆట పట్టిస్తుంటాను. అలాగే వాడి కాలం చెల్లిన భావాలను నేనెప్పటికప్పుడు తిప్పి కొడుతుంటాను. దీంతో నేనంటే వాడికి ప్రేమ ఉన్నా లోలోపల ఆ ప్రేమలో ఏదో వెలితి కనిపిస్తుంటుంది. వాడిప్పుడు ఊరిలో పెద్దమనిషి. ఎంతోమందికి సాయపడుతుంటాడు. తనకున్న అవగాహనమేరకు, గ్రామ కట్టుబాట్లు, పాత సంప్రదాయాల ప్రకారం ఎన్నో పంచాయతీలు జరుపుతుంటాడు. విడిపోయిన భార్యాభర్తలను కలుపుతాడు. అలాగే తల్లిదండ్రులను పట్టించుకోని సంతానానికి బుద్ధి చెబుతూ

పెద్దల జీవనోపాధికి ఏదో ఒక ఆధారం చేయాలని వారికి జీవన భృతినిచ్చేలా ఏర్పాటు చేస్తాడు.


''నువ్వు గనుక ఈ పెళ్లి చేస్తే నా శవాన్ని రైలు పట్టాలమీద చూస్తావు శ్రీకాంత్. మీరేమో హైదరాబాదులో ఉంటారు. ఇక్కడ పల్లెల్లో జనాలు మమ్మల్ని సూటిపోటి మాటలతో రాబందుల్లా పొడుచుకు తింటారు. అయినవారినందరినీ కష్టపెట్టి ఈ పెళ్లి చేయడంతో నీకు ఒరిగేదేముంది? అయినా కాకి ముక్కుకు దొండపండులా అతడికి మా సుశీలతో పెళ్లేమిటిరా? అదంటే మాకెంతో ప్రేమ. సుశీలకు నువ్వెందుకు వంతపాడుతూ మా గుండెల్ని రంపపు కోతకు గురిచేస్తావో అర్థంకాదు'' అన్నాడు రాజీవు.

నిజమే, రాజీవుకు చెల్లెలు సుశీలతో ఎక్కువ అనుబంధం. అయితే స్త్రీలను పురుషులతో వాడెప్పుడూ సమానంగా భావించడు. వారు సాంప్రదాయబద్ధంగానే ఉండాలని కోరుకుంటాడు. వివేకానందుడంటే వాడికి చాలా ఇష్టం. ఎవరైనా ఏమైనా అంటే వివేకానందుడు ఇలా చెప్పాడని, అలా చెప్పాడని ఉదహరిస్తుంటాడు గొప్ప తత్వజ్ఞానిలా. కొన్ని విషయాలను చదివి, గుర్తు పెట్టుకుని, వాటిని అప్పుడప్పుడు వల్లె వేస్తుండటంతో అమాయక ప్రజలు అతడినొక గొప్ప పండితుడిగా పరిగణిస్తుంటారు.

చాలాకాలం క్రితం జరిగిన ఓ సంఘటన. సుశీల పదోతరగతిలో స్కూల్ ఫస్టు వచ్చింది. ఆమె తొందరగా ఉద్యోగంలోకి చేరాలని, తన కాళ్లపై తను నిలబడాలని భావించింది. అందుకే ఏదైనా టెక్నికల్ కోర్సులో జాయిన్ కావాలనుకుంది. నిజానికి నేను కూడా ఆమెను ఇంటర్మీడియట్‌లో సైన్సు గ్రూపులో చేరమని చెప్పాను. అయితే ఆమె దానికంగీకరించలేదు. అప్పుడామె పాలిటెక్నిక్ కోర్సులో చేరే ప్రయత్నాన్ని రాజీవు తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆమె మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరుతానని చెప్పినప్పుడు వాడు అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. చాలా రాద్ధాంతం చేశాడు.

''వివేకానందుడు కూడా స్త్రీలకు స్వేచ్ఛ ఉండాలన్నాడు. వారికి విద్యను అందిస్తే తమ విముక్తిని తామే సాధించుకుంటారన్నాడు. అయితే స్త్రీలకు సంబంధించి వారికి ఉపయోగపడే కొన్ని ప్రత్యేకమైన కోర్సులను, వృత్తులను అభ్యసిస్తేనే మేలని స్వామీజీ చెప్పారు. అందుకే ఇంజనీరింగు కోర్సుల్లో చేరకుండా సుశీల మామూలు సాంప్రదాయకమైన కోర్సులో చేరడమే నాకిష్టం'' అన్నాడు ఆమె మనోభీష్టాన్ని, ఆమెను బాధిస్తున్న సమస్యను పట్టించుకోకుండా.

''వివేకానందుడు ఆ కాలం నాటికి మన దేశంలో మహా పురుషుడు. అందులో సందేహం లేదు. ఆయన చెప్పినవాటిని నీకిష్టమొచ్చినట్లు చెబుతూ నేటికీ అవే చెల్లుబాటు కావాలని మంకు పట్టు పట్టకు. ఆయన కాలంనాటికి స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించి మనదేశంలో ఇంకా సరైనా ఆలోచన అందుబాటులో లేదు. అందుకే అలాంటి మహావ్యక్తి సైతం ఆధునిక భావాల్ని అప్పటికింకా పూర్తి స్థాయిలో అందుకోలేదేమో?'' అన్నాను నేను.



ఆ మాటలన్నందుకు నావైపు అసహ్యంగా చూశాడు రాజీవు. ఇక ఆ సమయంలో వాడితో ఏం మాట్లాడినా లాభంలేదని నేను మిన్నకుండిపోయాను. వాడి విశ్వాసానికి ఎక్కడైనా కాస్త దెబ్బ తగిలితే వాడు తట్టుకోలేడు. ఒకరకమైన గుడ్డి తత్వం వాడిలో ఉంది. ఎవరైనా తననుగానీ, తాను చెప్పినదాన్నిగానీ విమర్శిస్తే విలవిలలాడిపోతాడు.

రాజీవు తన భార్యను చెప్పుకింద తేలులా పడివుండాలని కోరుకోడు. అయితే ఆమె భర్తతో ఎంత మాత్రం సమానమని భావించడు. అలాగే ప్రతీదీ తన ఆధ్వర్యంలో, తన కనుసన్నల్లో జరగాలని కోరుకునే మనస్తత్వం. అన్నింటిలోనూ వేలుపెట్టి పెద్దరికం వహించాలని ప్రయత్నిస్తాడు.

ఆనాడు ఆ పాలిటెక్నిక్ కోర్సులో చేరే విషయంలో సుశీలను తీవ్రంగా వ్యతిరేకించిన రాజీవుకు మళ్లీ ఇప్పుడు దానికంటే పెద్ద చిక్కు ఎదురయింది. ప్రస్తుతం ఆమె చేసుకోవాలనుకున్న కులాంతర వివాహాన్ని, రూపలావణ్యాల్లో ఆమెతో ఏమాత్రం సరితూగని వ్యక్తితో జీవితం పంచుకోవడాన్ని వద్దంటున్నాడు.

''అయినా పెళ్లనేది వ్యక్తులు వారి సొంత ఇష్టాయిష్టాలపైన చేసుకునేది. ఇందులో మూడో వ్యక్తి వేలు పెట్టడంగానీ, లేదా దాని గురించి చెడుగా అనుకోవడంగానీ ఎందుకు? కొన్ని యూరోపియన్ దేశాల్లో వ్యక్తుల బాహ్య సౌందర్యానికే విలువనిచ్చి పెళ్లి చేసుకోవడమనేది అంతగా లేదట. అక్కడి వారు ఈ విషయంలో ఎంతో అభివృద్ధి సాధించారట'' అంది సుశీల.

''పెద్దలంటే ఒకింత గౌరవం, భయం, భక్తి లేకుండా అలా మాట్లాడతావేంటి సుశీలా? ఇంకేమైనా అన్నకు ఎదురు మాట్లాడితే పళ్లు రాలగొడతాను. ఇంత ధైర్యం నీకెవరి ద్వారా వచ్చిందో, ఏయే దేశాల్లో ఎవరెవరెలా ఉంటారోనంటూ నువ్వు చెప్పేవాటిని నీ బుర్రలోకి ఎవరు ఎక్కిస్తున్నారో మాకు తెలుసులేవే. పెద్దలకే ఎదురెదురు సమాధానాలు చెబుతావా? ముదనష్టపుదానా? ఎవడెవడో అడ్డమైనవాడితో పరిచయాలు పెంచుకుని పెళ్లంటూ ఎగిరెగిరి పడుతున్నావా? సిగ్గు లేదూ నీకు?'' అంది మేనత్త రాజీవు పక్షం వహిస్తూ. ఆ మాట లంటున్నప్పుడు అక్కడే ఉన్న నావైపు మా మేనత్త గుడ్లురిమి చూసింది. ఆమె కళ్లల్లో నిప్పురవ్వలు ఎగిసిపడుతున్నాయి.

''రాజీవన్నయ్యా! నీకు నామీద నిజంగా ప్రేమంటూ ఉంటే నాకిష్టమైన వాడితో పెళ్లి చేసేందుకు అంగీకరించు. మీరు కొట్టినా, తిట్టినా, ఏం చేసినా నేను మాట ఇచ్చిన తర్వాత వెనుకడుగు వేయలేను. శ్రీకాంత్ అన్నయ్య తోడున్నంత వరకూ నాకేమీ భయంలేదు. నేను చదువుకున్నదాన్ని. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే శక్తి నాకు ఉంది. దయచేసి నా మానాన నన్ను వదిలేయండి. అలాగే అత్తయ్యా... మీరు నాకంటే పెద్దవారు. నాకు తల్లితో సమానం. అలాగని ఎలా పడితే అలా మీరు తిడుతుంటే నేను ఊరుకోలేను. పెద్దను గౌరవిస్తానుకానీ నా ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించను'' అంది సుశీల నిక్కచ్చిగా మేనత్తవైపు చూస్తూ.

దీంతో నావంకా, సుశీల వంకా రాజీవు తిరస్కార దృష్టి ప్రసరించాడు. మొహమంతా ఆగ్రహంతో కందగడ్డలా మారింది. నా ఎదురుగా సుశీల మీద చేయి చేసుకునేంత ధైర్యం లేదు వాడికి.

''ఛూత్... ఇది ఇల్లా వల్లకాడా? ఈ ఇంటిలో మనశ్శాంతే కరువయింది'' అంటూ తువాలు భుజాన వేసుకుని కోపంగా పొలం వైపుకు బయలుదేరాడు.

నిజానికి మా సుబ్బమ్మ మేనత్త వాడిని చిన్నప్పటినుంచి వెనుకేసుకుని రావడంవల్ల, ఆమెతో గాఢమైన అనుబంధం వల్లనే వాడు సనాతనుడిగా తయారయ్యాడు. ఆమె పెంపకం ప్రభావం వాడిపైన చాలా ఎక్కువగా పడింది. మా మేనత్త ఎప్పుడూ జప తపాలు చేస్తూ, ఉపవాసాలు ఉంటూ, మాలలో రుద్రాక్షలు లెక్కిస్తూ, అనేక

దేవుళ్ళ స్తోత్రాలు మననం చేసుకుంటూ నియమని ష్ఠలతో ఉంటుంది. ఆమెకు దైవభక్తి మెండు. మంచి మనిషి. ఒకరికి హాని తలపెట్టాలని, ఒకరిది కాజే యాలనే మన స్తత్వం ఆమెది కాదు. మమ్మల్ని ఎంతో క్రమశిక్షణతో పెంచింది. చిన్నప్పుడు మాకు రామాయణ, మహాభారత కథలు చెప్పేది. అయితే తన మనసుకు కష్టంగా తోచినదాన్ని ఆమె లోపల పెట్టుకుని, భావాల్ని అణచుకుంటూ కుమిలిపోదు. దేన్నైనా బయటికి కక్కేస్తుంది. చాలా పాత ఆలోచ నలతో జీవితం గడిపే మనిషి. కానీ ఆమె ఎంతో నిజాయితీపరురాలు. అంత వృద్ధాప్యంలోనూ ఒళ్లు దాచుకోకుండా చేతనైన పని చేస్తుంది. విద్యా గంధం లేకపోయినా చదువుకున్నవారికంటే ఎంతో హుందాగా, చక్కగా మసలుకుంటుంది. ఆమెను చూస్తే తప్పకుండా ఓ పదోతరగతి వరకైనా చదివి ఉంటుందనిపిస్తుంది. వాస్తవానికి ఆమెకు కనీసం బస్సు బోర్డులపై ఉన్న ఊర్లపేర్లు కూడా చదవడం రాదు. తనంతకు తనే జనాలను అడిగి తెలుసుకుని హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, విశాఖప ట్టణం ఎక్కడికైనా ఒంటరిగానే వెళ్లి వస్తుంది. అయితే ఆమెకు కులపిచ్చి. తక్కువ కులాల వారిపై ఏవగింపు. అయినా ఆమె మెత్తటి మనసును చాలా మంది పనివాళ్లు వేనోళ్ల కొనియాడుతారు. ఆమె అందరికీ కడుపు నిండా భోజనం పెడుతుంది. ఆకొ న్నవారిని అమ్మలా ఆదరిస్తుంది.

ఇప్పుడు మా మేనత్తకు, మా రాజీవుకు నా మీద పీకలదాకా కోపం ఉంది. సుశీల అన్నిరకాలుగా తనకంటే తక్కువగా ఉన్న వ్యక్తిని ఇష్టపడిందని, దానికి నేను అండగా ఉన్నానని వారు నామీద గుర్రుగా ఉన్నారు.

సుశీల పనిచేసే టెలికామ్ ఆఫీసుకు ప్రజా ఉద్య మాలకు సంబంధించిన కరపత్రాలు, సాహిత్యం తీసుకుని వచ్చే వ్యక్తితో ఆమెకు పరిచయమైంది. అతడు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించే ఓ సున్నితమైన వ్యక్తి. వయసులో ఆమె కంటే నాలుగేళ్ళు చిన్నవాడు. మొహంలో కూడా ఆమెకంటే కాస్త పసి ఛాయ అతడిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆమె ఎత్తు ఆరు అడుగులయితే అతడు ఐదడుగుల పొడవే. ఆమె ఎర్రగా ఉంటే అతడు కారు నలుపు. ఆమెది సలక్షణమైన గుండ్రటి ముఖం. అతడిది అంతగా అందంగాలేని కోలమొహం. ఆమెది నిండయిన భారీ విగ్రహం. ఆమె పక్కన అతడు గువ్వలా ఉంటాడు. కానీ అతడి ముఖ వర్చస్సు అద్భుతంగా ఉంటుంది. ఆ కళ్లల్లో ఏదో అద్భుతమైన మెరుపు, నడకలో ఠీవీ, హుందా తనం ఉంటుంది.

ఆమె ప్రేమకు బంధువులు, అయినవాళ్లే ప్రధాన అడ్డంకిగా మారారు. తన ప్రేమను చుట్టు పక్కలవారు సానుభూతితో అర్థం చేసుకునే పరిస్థితి ఆమెకు కనుచూపుమేరలో కనిపించడంలేదు. తన వివాహాన్ని ప్రస్తుతమున్న సమాజం హర్షించదని సుశీల లోలోనే బాధపడింది. ఒకరోజు నా దగ్గర విషయమంతా చెప్పింది. తను ప్రేమించిన హేమంత్ ఎంత మంచి మనిషో, అతడిది ఎంత ఉన్నత వ్యక్తిత్వమో వివరించింది.

''అతడు తన వ్యక్తిగత సౌఖ్యం గురించి ఆలోచిం చకుండా ఎల్లప్పుడూ సమాజంకోసం పరితపించే వ్యక్తి. మా ఇద్దరి మనసులు, అభిరుచులు కలిశాయి. నాకు ముప్పై రెండేళ్ళు. అతడికి ఇరవై ఎనిమిదేళ్లు'' అంది. నేను కూడా ఆమెను నిరుత్సాహ పరిస్తే ఇక ఆమెకు ఎవరూ ధైర్యం చెప్పేవాళ్లు ఉండరు. ఆమెది మల్లెపూవులాంటి సున్నితమైన మనసు. ఎదుటివారి కష్టాల పట్ల స్పందిస్తుంది. ఈ ప్రపంచంలో జరిగే అరాచకాలు, అన్యాయాలు చూసి ఆమె మనసు ఆక్రో శిస్తుంది. అలాంటివి ఎవరి ద్వారానైనా విన్నప్పుడు లేదా పత్రికల్లో చదివినప్పుడు ఆమెకు తెలియకుం డానే కన్నీళ్లు పెల్లుబుకుతాయి. అంత స్పందించే హృదయం ఆమెది. అందుకేనేమో ఆమెకు హేమంత్ అంటే ఇష్టం కలిగింది.

''వ్యక్తులను పెళ్లిచేసుకునేందుకు కావాల్సింది వారి ఉత్తమ సంస్కృతి, గుణగుణాలు, ఇరువురి మనసుల కలయిక, అంతేకాని బాహ్య సౌందర్యమే గీటురాయి కాదు. ఎంత అందంగా ఉన్న జంట అయినా వారిలో మంచిగుణం లేకపోతే ఆ సంసారం కలతలతో నిండిపోయి వికారంగా కనిపి స్తుంది. దంపతుల్లో అందం చాలాకాలం అలాగే ఉండదు. కేవలం అందంపై ఆధారపడి ఉన్నత విలువలు లేకుండా ఏర్పడిన బంధం కలకాలం నిలువదు. అందం తగ్గుతూ పోతున్న కొద్దీ, వారిలో మోహం, ఆకర్షణ తిరోగమనం పట్టడం ఖాయం. ఆ తర్వాత ఆ బంధం బలహీనమవు తుంది. ఆ కాపురాన్ని చూసేవారికి కూడా అసహ్యం వేస్తుంది. అలాంటి కాపురం చుట్టుపక్క లవారిని సైతం కలుషితం చేస్తుంది. ఇంట్లో పిల్ల లపై కూడా దాని దుష్ప్రభావం పడుతుంది'' ఆమె మొహంవైపు పరిశీలనగా చూస్తూ చెప్పాను. నేను చెప్పే విషయాలను ఆమె ఎంతో ఆసక్తిగా, ఉద్వే గంతో, లీనమై వింటోంది.

సమస్త బంధుజనం, ఊరిలోని పెద్దవాళ్ళు సుశీల – హేమంత్‌ల వివాహ ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇక సుశీల అమ్మానాన్న లయితే సరే సరి. ఉన్న ఒక్కగానొక్క కూతురు తమ మాటను తృణీకరించి పెళ్లి చేసుకుంటున్నందుకు చాలా నిరాశకు లోనయ్యారు. పల్లెటూరిలో వారిని కాకుల్లా పొడుచుకు తినే లోకుల సూటిపోటి మాట లతో చిక్కి శల్యమైపోయారు. మా బంధువర్గం లోని మరికొంతమంది ఆవేశపరులు కాట్లకుక్కల్లా పైబడి వారిని పీక్కు తీనేందుకు సిద్ధంగా ఉన్నారు. మరో వైపు అవకాశం వస్తే దొరికినప్పుడు దొరికిన ట్టుగా నన్ను చితకబాదాలని మా బంధువర్గంలోని కొద్దిమంది యువకులు నాపై కసిగా ఉన్నారు.



''శ్రీకాంత్ అన్నయ్యా! ఎలాగైనా కానీ నువ్వు కొంచెం జాగ్రత్తగా ఉండు. ఈ మూర్ఖులు, ఛాందస వాదులు ఎక్కడ నీమీద దాడి చేస్తారోనని భయంగా ఉంది'' అంది సుశీల ఒకరోజు.

'వాళ్ళమొహం... ఈ గొర్రెల్లాంటి ఈ బంధు జనం నన్నేం చేయలేరమ్మా. నాకేం కాదమ్మా!

నామీద ఎవరూ చేయి చేసుకునేంత పరిస్థితి లేదు. వారు ఆపదలో ఉన్నప్పుడు నేనెన్నిసార్లు ఆదుకున్నాను. నిర్మల చిత్తంతో వారికి సాయం చేశాను. అందువల్ల వారు నన్నేమీ చేయరనే నా నమ్మకం'' అన్నాను నవ్వుతూ.

''అన్నయ్యా అమ్మానాన్నల బాధ చూస్తుంటే వారిని ఇంతగా ఇబ్బందిపెట్టి ఈ పెళ్లి చేసుకోవడం అంత అవసరమా అనిపిస్తోంది. నాలో నేనే కుమిలిపోతుంటాను. నా సుఖం కోసం కన్నవాళ్లను బాధపెట్టడం సరైనదేనా?'' అంది సుశీల విచారంగా.

''ఇందులో నీ తప్పేమీ లేదమ్మా. చారిత్రకంగా వచ్చిన కొన్ని కాలంచెల్లిన భావాల వల్లనే వారు అనేక బాధలకు లోనవుతున్నారు. వారి భావాలను మార్చుకుంటే ఈ బాధలేమీ ఉండవు. ఆ పెద్దల గురించి అంతగా ఆలోచించి బుర్ర పాడు చేసుకోకు. వారి బాధలకు కారణం మనం కాదు. వారి కాలంచెల్లిన ఆలోచనలను మార్చుకోకుండా ఉండటంతోనే కదా వారికీనాడు బాధ. నూతన వ్యక్తులను తయారు చేయాలంటే ఈ వేదన, ఈ బాధ తప్పక అవసరం. ప్రసవం తర్వాత వచ్చే బిడ్డను చూసి తల్లి ఎంత మురిసిపోతుందో కదా! పురిటినొప్పులకు భయపడి మనం బిడ్డకు జన్మనివ్వడాన్ని అడ్డుకోవడం సరైనది కాదు. కులపెద్దలు, బంధువులు, తల్లిదండ్రులు నీ పెళ్లి విషయంలో పడుతున్న బాధకు కారణం మనం కాదు. మనం చేయగలిగింది వారికి నచ్చజెప్పి వారిలోని పాత భావాలను మార్చే ప్రయత్నం చేయడమే. నువ్వేమీ అపరాధభావంతో కుమిలిపోకు. ఇందులో నీ తప్పేమీ లేదమ్మా'' అన్నాను ఆమెను అనునయిస్తూ.

***

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఎదుటకు కొంతమంది హితైషులతో సుశీల-హేమంత్‌లను మా ఇంటి నుంచి కారులో తీసుకొచ్చాను. అప్పటికే రిజిస్ట్రార్ వచ్చారు. ఆయనతో గతంలో రెండుసార్లు ఫోన్‌లో మాట్లాడినప్పుడు ''అబ్బాయి, అమ్మాయిలను తీసుకురండి. ఫైల్ రెడీ చేస్తాను'' అన్నాడు. మేమెంతో ఉత్సాహంగా అక్కడికి వెళ్లాం. తీరా వెళ్లాక ఆయన అజ్ఞానాన్ని చూసి అవాక్కయ్యాం. గుడిలో పెళ్లి చేసుకుని, ప్రస్తుతం దాని రిజిస్ట్రేషన్ కోసం మేము వచ్చామని ఆయన భావించాడట. ఆయనకు వధూవరులు ఇంకా పెళ్లి చేసుకోలేదని, వాళ్ల ఆఫీసులో రిజిస్ట్రేషన్ పద్ధతిలో ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చారని చెప్పా. ఆయన తలకెక్కలేదు. వధూవరులిద్దరూ హిందువులే కాబట్టి గుడిలో తాళికట్టుకుని వస్తే, తర్వాత ఇక్కడ హిందూ వివాహ చట్ట ప్రకారం పెళ్లిని నమోదు చేసుకుంటామంటాడు.

''ఇది హిందూ వివాహం కాదు. మతాచారాల ప్రకారం వీరు పెళ్లి చేసుకోవట్లేదు. స్పెషల్ మ్యారేజి యాక్ట్ కింద పెళ్లికోసం వీరి దరఖాస్తును స్వీకరించండి'' అన్నాను వేడుకోలుగా. ఎంత చెప్పినా ఆ ఆఫీసర్ వినట్లేదు. పైగా తను చెప్పినట్టు మేం వినాలని చెబుతున్నాడు. ఎక్కడైనా గుడిలో పెళ్లి చేసుకుని వచ్చి ఇక్కడ దరఖాస్తు చేసుకోవాలని అంటున్నాడు. అలాంటి సంప్రదాయ వివాహాన్ని చేసుకోకూడదనే అక్కడికి వచ్చామని కాస్త గట్టిగానే చెప్పాం. అయినా ఆ విషయం ఆయనకు అర్థం కావట్లేదు.

''మేము అడిగినట్లు ప్రత్యేక వివాహ చట్టం కింద ఫైల్ తయారు చేసేందుకు మీకొచ్చిన కష్టమేమిటో చెప్పండి'' అంది సుశీల విసిగి వేసారి.

''స్పెషల్ మ్యారేజి యాక్ట్ కింద ఈ పెళ్లిని ఎలా రిజిస్టర్ చేసుకుంటారో, అందులోని రూల్స్ ఏమిటో నిజానికి అవన్నీ మాకు తెలియవు. అసలు ఆ చట్టం కింద ఒకే మతానికి చెందిన మీలాంటివారికి వివాహం చేసుకునే హక్కు ఉందో లేదో కూడా తెలియదు. నాకు తెలిసీ మా రూల్స్ దీనికి ఒప్పుకోవు. సాధారణంగా దంపతులు ఎక్కడైనా పెళ్లి చేసుకుని, వెడ్డింగ్ కార్డుతోపాటు కనీసం తాళి కడుతున్నట్లు ఉన్న ఒక ఫోటో, లేదా అక్షింతలు వేస్తున్న ఫోటోలాంటివి తీసుకువస్తే చాలు. తమకు పెళ్లయినట్లు ఒక్క ఆధారం చూపిస్తే మేము ఆ వివాహాన్ని రిజిస్టర్ చేసుకుంటాం. ఇదివరకే ఎక్కడైనా చేసుకుని వచ్చిన పెళ్ళిళ్లనే ఇంతవరకూ ఇక్కడ నమోదు చేసుకున్నాం. మీది విచిత్రమైన కేసు. మా ప్రాంతంలోనే ఇంతవరకూ ఇలాంటి పెళ్లిని మేము రిజిస్టర్ చేయలేదు. మీరు జిల్లా హెడ్ క్వార్టర్‌కు వెళితే బాగుంటుంది. ఇక్కడ మావల్ల కాదు. దీని అప్లికేషన్ ఫారంలు కూడా మా దగ్గర లేవు. దీన్ని ఎలా రిజిష్టర్ చేసుకోవాలో ఆ ప్రొసీజర్స్ కూడా మాకు తెలీవు'' అన్నాడు సబ్ రిజిస్ట్రార్ నుదురు కొట్టుకుంటూ.

అసలు ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన ప్రభుత్వ అధికారులకు, ఆ ప్రభుత్వ యంత్రాంగానికే విషయాలపై ఇంత ఉదాసీనత ఉంటే ఎలా అనిపించింది. అలాగే మాకు సాయం చేయాలని, పై ఆఫీసుకు ఫోన్ చేసైనా విషయం కనుక్కోవాలనే ఆత్రుత కూడా ఆ ఆఫీసరులో ఇసుమంతైనా లేదు. ఆయన నిష్క్రియాపరత్వం, అలసత్వం చూస్తే ఎంతటి శాంతమూర్తికైనా తప్పకుండా కోపం వస్తుంది.

''సర్, నేను న్యాయవాదంలో పోస్ట్‌గ్రాడ్యుయేట్‌నండీ. నాకు స్పెషల్ మ్యారేజి యాక్ట్ గురించి తెలుసు. పెళ్లిళ్ళను కుల, మత ప్రసక్తి లేకుండా ఎవరైనా ఆ చట్టం ప్రకారం చేసుకోవచ్చు. అప్లై చేసిన నెలరోజుల తర్వాత, రెండు నెలల లోపల ఎప్పుడైనా దంపతులు వచ్చి దీన్ని రిజిస్టర్ చేయించుకోవచ్చు'' అన్నాడు వరుడు హేమంత్.


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చ్ వెనుక, అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration & Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

అమీర్‌పేట, కూకట్‌పల్లి, దిల్‌షుఖ్‌నగర్, విజయవాడ, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఖమ్మం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, (చెన్నయ్) టి.నగర్, బెంగుళూర్, సేలం, మధురై, వెల్లూరు, తిరుచి, పాండిచ్చేరి, ఈరోడ్, ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


ఇలా ఆఫీసర్‌తో వాదోపవాదాలు జరుపుతుంటే బయట మా బంధువుల అలికిడి ప్రారంభమైంది. సదరు ఆఫీసరుగారు కాలయాపన చేస్తూ ఏవేవో పాత ఫైల్స్, బిల్లులపై సంతకాలు చేసుకుంటూ కూర్చున్నారు. మా విషయాన్ని పట్టించుకోవట్లేదు. సుశీల ఈ ఆలస్యాన్ని భరించలేక కొద్దిగా విసుగు చెందింది. ఈ లోపల బయట ఆవరణలో మా ఊరి జనం గుమిగూడుతున్నారు. దీంతో ఏం జరుగుతుందో ఏమోననే బెంగతో మేము మరింత ఒత్తిడికి గురయ్యాం. ఏమి చేయాలా.... సుశీల దీన్నంతా ఎలా తీసుకుంటుందో ఏమోనని కాస్త బెంగగా కూడా ఉంది.

ఆ గందరగోళాన్ని చూసిన సుశీల తనలోని నిస్సత్తువను విదిల్చి కొట్టింది... వడలిన ఎర్రగులాబీలా ఉన్న ఆమె వదనంలో అకస్మాత్తుగా మార్పు వచ్చింది. అంతవరకూ తననావరించుకున్న జడత్వాన్నంతా వదలించుకుంది. తనే ఎంతో చొరవ తీసుకుని. ''ఆఫీసర్‌గారూ! మీరు మేము కోరినట్లుగా మా వివాహ రిజిస్ట్రేషన్ ఫారాలను రెడీచేసి ఫైల్ చేసుకుంటారా? లేదా కలెక్టరు గారికి ఫిర్యాదు చేయాలా? ఆలోచించుకోండి.. ఐదు నిమిషాలు సమయమిచ్చాం'' అంది దృఢంగా.

దీంతో ఆ ఆఫీసర్‌లో వేడిపుట్టి కాస్త చలనం వచ్చింది. అతడికి ముచ్చెమటలు పోశాయి. ఎవరె

వరికో ఫోన్లు చేసి దీని గురించి ఆరాతీస్తున్నాడు.

మా బంధువులంతా రిజిస్ట్రార్ ఆఫీసు ఎదుట నాలుగైదు గ్రూపులుగా కూర్చుని చర్చించుకుంటున్నారు. వారిలో కొద్దిమంది అమ్మలక్కలు ఎవరో చనిపోయినప్పుడు శవం ముందర కూర్చుని ఏడ్చినట్లు గట్టిగా పెడబొబ్బలు పెడుతూ, శాపనార్థాలు పెడుతూ ఓ మూలగా కూర్చుని ఏడుస్తున్నారు. వారు నన్ను, సుశీలను తిట్టుకుంటున్నారు. ఆ ఏడుపు మేళానికి నాయకత్వం వహించింది మాత్రం మా మేనత్త వెంకట సుబ్బమ్మే. ఆమె ఏడుపు గొంతు బాగానే వినిపిస్తోంది.

అలా ఏడ్చేవారిలో చేరి మా సుశీల అమ్మానాన్నలు కూడా వారితో శృతి కలిపారు. నిజానికి నేను చాలా రోజులుగా సుశీల తల్లిదండ్రులకు ఎంతో ధైర్యాన్ని నూరి పోశాను. తమ కూతురు చేస్తున్న పని ఎంతమాత్రం తప్పుకాదని చెప్పాను. పైగా అదే గొప్ప పని అని, సమాజమంతా దాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పాను. నామీద వారికున్న ప్రేమ, గౌరవంవల్ల నేను చెప్పినప్పుడు అంగీకరిస్తారు. నేను చెప్పింది సరైనదే అంటారు. అప్పుడు వారి మనసు కాస్త కుదుట పడుతుంది. ప్రశాంతమవుతుంది. మళ్లీ ఎవరైనా వచ్చి వారిని ఈ పెళ్లి విషయంగా కదిలిస్తే సమస్య మొదటికే వస్తుంది. వారి కూతురు చరిత్రలో అంతవరకూ కనీవినీ ఎరగనంత, ఎవరూ చేయని తప్పు చేస్తోందని కఠినంగా మాట్లాడితే అంతవరకూ నేనిచ్చిన ధైర్యం, స్ఫూర్తి అంతా మట్టికొట్టుకునిపోతుంది.

'మనలో ఎంత లోతుగా కులం, అందం, ఈడూజోడూ, పురుషుడే అన్నింటిలోనూ భార్యకంటే మెరుగ్గా ఉండాలనే ఆలోచనలు పాతుకునిపోయి వధూవరుల ఎంపికలో తమ ప్రభావాన్ని చూపిస్తున్నాయో తలచుకుని బాధ వేసింది. ప్రజలను మార్చడం అంటే వారి ఆలోచనలను, పాత భావాలను, విశ్వాసాలను మార్చడమే కదా? రకరకాల తప్పుడు అభిప్రాయాలకు బలైన ప్రజల దృక్కోణాన్ని మారిస్తే వారు విషయాలను చూసే తీరు, అర్థం చేసుకునే తీరులో తప్పకుండా మార్పు వస్తుంది' అని నాలో నేనే తర్కించుకున్నాను.

***

సుశీల హేమంత్‌ల పెళ్లయిన ఏడేళ్ల తర్వాత మేనత్త వెంకటసుబ్బమ్మ, సుశీల అన్న రాజీవు డాక్టరుకు చూపించుకునేందుకు హైదరాబాద్ వచ్చారు. నిమ్స్ హాస్పిటల్ ఎదురుగా పెట్రోల్ బంక్ వద్ద క్రికెటర్ వి.వి.లక్ష్మణ్ తండ్రి డాక్టర్ వి.శాంతారాం క్లినిక్ కోసం వెతుకుతుంటే సుశీల కంట పడ్డారిద్దరూ. అదేసమయంలో నేను వారం రోజులపాటు వివిధ యూనివర్సిటీల్లో గెస్ట్ లెక్చర్స్ ఇచ్చేందుకు హైదరాబాద్ వదలిపెట్టాను. తెలిసినవాళ్ళు లేక వారు అనేక ఇబ్బందులకు గురవుతూ అక్కడా ఇక్కడా తిరిగారంట. ఇక వారి అదృష్టవశాత్తు సుశీల హేమంత్‌లు స్కూటర్ మీద వెళుతూ మేనత్తను చూశారు. తర్వాత సుశీల జంకుతూనే వారిని తమ ఇంటికి ఆహ్వానించిందట. ఆమె పెళ్లి తర్వాత అదే మొదలు అత్తతో మాట్లాడటం. అప్పటికే రాజీవు భార్యతో వేగలేక సుశీల అమ్మానాన్నలు ఆమె దగ్గరికి వచ్చి మూడేళ్లయ్యాయి. సుశీల దగ్గర ఉంటే సంతోషంగా ఉండవచ్చని వారు భావించారు.

మా మేనత్త హేమంత్‌ను చాలా నిశితంగా పరిశీలించిందట. సుశీల అమ్మానాన్నలను అతడెంత ప్రేమగా చూసుకుంటాడో, ఇంటి పనుల్లో భార్యకు ఎలా సాయం చేస్తాడో, కొడుకుకు ఎలా చదువుల్లో సహకరిస్తాడో, ప్రజల్లో చైతన్యం కోసం అనుక్షణం ఊపిరి సలపకుండా ఎలా పనిచేస్తున్నాడో చూసి ఆమె చాలా సంతోషించిందిట. హేమంత్ ప్రవర్తన ఎంత హుందాగా, గొప్పగా ఉంటుందో నాలుగైదు రోజుల్లో దగ్గర నుండి బాగా గమనించిందామె. వారి దాంపత్యాన్ని చూసేందుకు రెండుకళ్లూ చాలవని చెప్పిందట. రాజీవు కూడా ఏదో తప్పు చేసిన వాడిలా సిగ్గుపడుతూ ముభావంగా ఉన్నాడట.

ఊరికి వెళ్లేముందు మేనత్త నాతో ఒక్కసారి ఫోనులో మాట్లాడాలని చెప్పిందట. సుశీల నా సెల్‌కు ఫోన్ చేసింది. మా మేనత్త ఫోనులో బోరుమని విలపించింది. ''నేను తప్పు చేశానురా శ్రీకాంత్. అబ్బాయి, అమ్మాయి చిలకాగోరింకల్లా ఉన్నారు. అసలు హేమంత్ ఎంత మంచివాడురా! వారి దాంపత్యం చూస్తుంటే కన్నులపండువగా ఉంది. ఇలాంటి గొప్పవాణ్ణి పెళ్లి చేసుకోవద్దని నేనెంత హఠం చేశానురా. హేమంత్ నన్ను చాలా అపురూపంగా చూసుకున్నాడురా. నా ఆరోగ్యం గురించి ఎన్ని శ్రద్ధలు చెప్పాడో. వెంటనే ఊర్లోకి వెళ్లి అందరికీ వీళ్ల దాంపత్య గురించి చెబుతాను. నేను చేసిన తప్పును అలా కడుగుకుంటానురా. చూసేందుకు బాహ్యరూపం బాగుండీ ఎప్పుడూ కలతలతో గడిపే సంసారాల్లో దంపతులిరువురూ ఎంత అందంగా ఉన్నా నేనలాంటి చోట ఒక్క క్షణం ఉండలేనురా అబ్బాయి. మేము ఎంత మరుగుజ్జులం, అల్పులం నాయనా! ఒరేయ్ శ్రీకాంత్.... నిన్ను అనరాని నానా మాటలు అన్నాను. దయచేసి నన్ను క్షమిస్తావు కదరా. అవేమీ మనసులో పెట్టుకోకురా. నేను నా తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటానురా'' ఇంకా ఇలాంటివే చెప్పుకుంటూ పోతోంది, మధ్యమధ్యలో ఏడుస్తూనే.

ఇక ఇప్పుడు రాజీవు వంతు. ''శ్రీకాంత్! మేము అప్పుడు చాలా అమానుషంగా ప్రవర్తించాం. నేను మీలాగ ఆధునికంగా ఆలోచించగలనో లేదో తెలియదు. అయితే మొత్తానికి మన సుశీల–హేమంత్‌ల విషయంలో నేను చాలా తప్పటడుగు వేశాను. పల్లెటూరి సమాజంలో బతికే నేను నా ఆలోచనలతోనే యుద్ధం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాను. నేను కూడా మారేందుకు ప్రయత్నిస్తానురా. దీనికి మీలాంటివారి సహాయసహకారాలు లభిస్తాయి కదూ?'' అన్నాడు ఆవేదనగా.

ఇక మా మేనత్త ఏమి చేసినా తను నమ్మిన దాన్ని బలంగా చేస్తుంది. ఆమెలో ఈ వయసులో ఏమైనా మార్పు వస్తుందంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇప్పుడు ఊరికి వెళ్లి ఏం చేస్తుందో ఏమో? అందరికీ తను చూసిన ఆ విషయం చాటింపు వేసి చెప్తుందేమో! అయినా నరనరాల్లో జీర్ణించుకున్న పాత ఆలోచనలను వదిలించుకోవడం ఆమెకి సాధ్యమేనా? ఏమో? అంత శక్తి ఆమెలో ఉందో లేదో కాలమే నిర్ణయించాలి.

❑

రచయిత్రి సెల్ నెం: **91 9480707076**

కవిత poem



## (వి)నాయకుడు

ప్రజాధనాన్ని మ్రింగి తెగబలిసిన నాయకుడు
నీతినియమాలతో దానధర్మాలు చేసే వినాయకుడై,
ఆధిపత్యం కొరకు అరాచకాలు చేసే జనపతి
విఘ్నాలను పారద్రోలి లోకక్షేమం కాంక్షించే గణపతియై,
పదవి చిక్కిన తదుపరి కోట్లకు పడగలెత్తే ప్రజాపతి
జగన్మాత సృష్టి ధర్మాన్ని నిలబెట్టే విఘ్నాధిపతియై,
జాతి ప్రగతికి అవరోధంగా నిల్చిన జనాధిపతి
జన సౌఖ్యం కోరే మూల్లోక మూషిక వాహనుడై
మతాల మారణ హోమాలు జరిపించే ప్రజాధిపతి
శాంతి సుగంధం వెదజల్లే ప్రజానురంజక మాన్యాయుడై,
స్వలాభాపేక్షతో అవినీతి కుంభకోణాలు చేసే జనసారధి
న్యాయాన్ని నాల్గుపాదాలా నడిపే నీలకంఠ తనయుడై,
అరచేతిలో మొత్తం వైకుంఠాన్నే చూపే అధినాయకుడు
సద్గీతా ప్రబోధంతో పృథ్వికి వెలుగు చూపే విఘ్నేశ్వరుడై,
జన మూషికాలతో వర్తకం చేసి మోసగించే జననేత
మానవ మనుగడకు ఆయువుపోసే బొజ్జ గణపయ్యయై,
కల్లబొల్లి వాగ్దానాలతో వరాలిచ్చే ప్రజానాయకుడు
ఇష్ట సంపదలిచ్చే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడై
పదవీకాంక్షతో ప్రజాస్వామ్య మంత్రం పఠించే ప్రజాధిపతి
సంఘశక్తులన్నిటినీ సంఘటిత పరచే గౌరీసుతుడై,
కులాల కుమ్ములాటకు ఆజ్యం పోసే జనాధ్యక్షుడు
స్నేహ హస్తాన్నందించి చైతన్యాన్నిచ్చే గణాధ్యక్షుడై,
స్వార్థ కపటాలతో విభజించి పాలించే నాయకుడు
సమ సమాజాన్ని నిర్మించే నిస్వార్థ గణనాయకుడై,
మారిన నాడు... ఆ రోజొచ్చిన నాడు...
సకల నాయకులు వినాయకుని ఆదర్శంగా తీసుకొన...
ముక్కంటి తనయుని ముదముతో పూజింప...
సుపరిపాలన మనకు జయమంగళము కాదే!

–పల్లి నల్లనయ్య

చేతన సచివాలయ సారస్వత వేదిక ఆధ్వర్యంలో
జరిగిన పోటీలో తృతీయ బహుమతి పొందిన కవిత